సాక్షి నిజామాబాద్

సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



పొగాకు రైతుల్లో టెన్షన్
పొగాకు జీట్లు ప్రారంభించకపోవడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.
- 8లో ▸



ఇరవై ఏళ్లుగా నూరు శాతం..
బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామం ఇంటి పన్ను చెల్లింపులో ఎన్నో గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.8 /19.5
ఉదయంనుంచే ఎండ తీవ్రత ప్రారంభమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఖలీల్‌వాడి: అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ ఆఫీసులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సూపరింటెండెంట్ నవాజ్‌ఖాన్, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నిలిచిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా విడుదలవుతున్న నీటిని ఆదివారం ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు. యాసంగి సీజన్ కోసం విడుదలవుతున్న నీటిని ఈ నెల 9వ తేదీనే నిలిపివేయాల్సి ఉంది. కానీ, కాకతీయ కాలువ జోన్–2 ఆయకట్టు కోసం ప్రాజెక్ట్ అధికారులు మూడు రోజులపాటు నీటి విడుదలను కొనసాగించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నుంచి అన్ని కాలువలు, లిఫ్టులకు నీటి విడుదల నిలిచిపోగా, ఆదివారం నాటికి ప్రాజెక్ట్‌లో 11.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిలిచిన విద్యుదుత్పత్తి
కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల నిలిపివేయడంతో జల విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. మళ్లీ వచ్చే ఖరీఫ్ సీజన్‌లో కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టే వరకు విద్యుదుత్పత్తి జరిగే అవకాశం ఉండదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 3.44 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు జెన్‌కో అధికారులు వెల్లడించారు.

33కేవీ, 11కేవీ ఫీడర్లపై ఎఫ్‌పీఐలు

సుభాష్‌నగర్: విద్యుత్ సరఫరా వ్యవస్థలో 33కేవీ, 11కేవీ దూరమైన లైన్‌లలో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు (ఎఫ్‌పీఐ)లను పెడుతున్నామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రాపెల్లి రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాలు, బ్రేక్ డౌన్, ప్రకృతి వైపరీత్యాల సమయంలో లైన్ మొత్తం తనిఖీ చేసే అవసరం లేకుండా, సమస్య ఏర్పడిన ప్రాంతాన్ని ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ విభజిస్తుందని పేర్కొన్నారు. అంతరాయం ఏ భాగంలో జరిగిందనే విషయాన్ని వెంటనే విశ్లేషించి నేరుగా అక్కడికే వెళ్లి పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ద్వారా విద్యుత్ అంతరాయ సమయాన్ని గణనీయంగా తగ్గించొచ్చని తెలిపారు. ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లను 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్‌లలో అంతరాయాల గుర్తింపు, వాటి నివారణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని 50 విద్యుత్ ఫీడర్లలో, ఎఫ్‌పీఐలను బిగించేందుకు సాంకేతికంగా వ్యూహాత్మక ప్రదేశాలను గుర్తించామని తెలిపారు.

21 నుంచి పరివర్తన్ సమ్మర్ క్యాంప్

నిజామాబాద్ రూరల్: నగరంలోని శ్రీరామకృష్ణ విద్యానికేతన్ హైస్కూల్‌లో ఈ నెల 21 నుంచి పరివర్తన్ – సమ్మర్‌క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మధుసూదనచారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాంప్‌లో యోగా, మెడిటేషన్, భగవద్గీత, భజన్, చెస్, డ్రాయింగ్ తదితర వాటిపై విద్యార్థులకు శిక్షణ ఉంటుందని అన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9290449389, 9848225409, 7396994484 నంబర్లను సంప్రదించాలని కోరారు.



మా మామ పేరుపై సిర్నాపల్లి రెవెన్యూ శివారులోని 226 సర్వే నంబర్‌లో ఎకరన్నర, అలాగే నల్లవెల్లి రెవెన్యూ శివారులో 30 గుంటల భూమి ఉంది. ధరణి వచ్చిన తరువాత అసలు రికార్డుల్లోనే వివరాలు లేకుండాపోయాయి. ఇప్పటివరకు కొత్త పాస్‌పుస్తకాలు రాలేదు. రైతుబంధుతోపాటు పంటరుణం పొందలేకపోయాం. ఐదు సంవత్సరాలుగా రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. భూభారతితోనైనా మాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం.

– నాందేడపు రాజన్న, నల్లవెల్లి





భూ భారతి వచ్చే..!

- ధరణి స్థానంలో నూతన పోర్టల్
- సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న రైతులు
- నేడు అధికారికంగా ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

ఇందల్వాయి: ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న 'భూ భారతి' పోర్టల్‌తో రైతుల్లో ఆశలు చిగురించాయి. రైతులు, ప్రజలకు సులభంగా, వేగంగా సేవలందిస్తూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో భూ భారతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. వ్యవసాయభూముల రికార్డుల్లో నెలకొన్న గందరగోళం, పాస్‌పుస్తకాల జారీలో జాప్యం కారణంగా ఎంతో మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ధరణిలోని 33 మాడ్యూళ్లను భూ భారతికి వచ్చేసరికి ఆరుకి కుదించారు.

రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలివే..

- పొజిషన్‌లో ఉన్నా ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో భూముల వివరాలు లేకపోవడం, నూతన పట్టా పాస్‌పుస్తకాలు రాకపోవడం.
- నూతన పాస్‌పుస్తకాలు వచ్చినా పూర్తి స్థాయిలో విస్తీర్ణం నమోదు కాకపోవడం.
- పట్టా భూములు అసైన్డ్‌గా, అసైన్డ్ భూములు పట్టాలుగా నమోదవడం.
- ఆబాది భూములు వ్యవసాయ భూములుగా, వ్యవసాయ భూములు ఆబాదిగా నమోదవడం.
- ఒకరికి చెందిన భూములు మరొకరి పేరు మీద నమోదవడం. తద్వారా గ్రామాల్లో భూ పంచాయితీలు పెరగడం.
- భూ విస్తీర్ణం రికార్డుల్లో హెచ్చుతగ్గుల(ఆర్ఎస్ఆర్) సమస్య కారణంగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడం, స్లాట్ రద్దయితే చెల్లించిన డబ్బులు తిరిగి రాకపోవడం.
- కారణాలు చెప్పకుండా దరఖాస్తుల తిరస్కరణ.

పేరుకుపోయిన దరఖాస్తులు..
ధరణి వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది రైతుల భూ రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోగా, నమోదైనవి తప్పుల తడకగా ఉన్నాయి. వాటిని సరిదిద్దుకునేందుకు రైతులు ఏళ్ల తరబడి తహసీల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే సమస్యలను పరిష్కరించే అధికారం తహసీల్దార్ స్థాయిలో లేకపోవడం, వెబ్‌సైట్ నిర్వహణ, సమస్యల పరిష్కారం సక్రమంగా లేకపోవడంతో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. ఈ కారణంగా ధరణి వెబ్‌సైట్‌పై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది.

తగిన ఆప్షన్లు ప్రవేశపెట్టాలి



రైతులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా పరిష్కరించే ఆప్షన్‌లను భూ భారతిలో ప్రవేశపెట్టాలి. చిన్నచిన్న సమస్యలు తహసీల్ కార్యాలయాల్లోనే పరిష్కారమయ్యేలా అధికారాలు బదిలీ చేయాలి. ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. రికార్డులను తారుమారు చేసే, లోసుగులను అడ్డు పెట్టుకొని భూములను అక్రమంగా మార్పిడి చేసే అధికారులను కఠినంగా శిక్షించాలి. – నోముల రాజులు, రైతు, నల్లవెల్లి

భూ భారతి వచ్చేదాక ఆగమన్నారు



నా భర్త చనిపోయి మూడు నెలలు అవుతోంది. తన పేరుపై ఉన్న భూమిని నా పేరు మీదికి మార్చమని వెళ్తే సర్వే నంబర్లలో విస్తీర్ణం వ్యత్యాసం ఉంది. ఇప్పుడు చేయడం కుదరదు. భూ భారతి వచ్చేదాకా ఆగమన్నారు. ఇప్పుడేమో భూ భారతి కేవలం మూడు మండలాల్లోనే అంటున్నారు. త్వరగా భూ భారతిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి నాలాంటి వారి సమస్యలను పరిష్కరించాలి.

– కుంటజంగుల పద్మ, నల్లవెల్లి

పరిష్కారం లభిస్తుంది



రైతులు ఎదుర్కొంటున్న అన్ని భూ సమస్యలకు నూతన ఆర్‌వోఆర్ చట్టం–2025 భూ భారతితో తప్పకుండా పరిష్కారం లభిస్తుంది. సీనియర్ ఐఏఎస్‌లు, విశ్రాంత రెవెన్యూ అధికారులు, భూ చట్టాల నిపుణులు, రైతు సంఘాల నేతలతో విస్తృతంగా చర్చించి రూపొందించిన భూ భారతి ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. భూ రికార్డుల పటిష్టానికే భూభారతిని తీసుకొస్తోంది. – సుంకెట అన్వేష్‌రెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప



సమీక్షలో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి , ప్రభుత్వ సలహాదారు షబ్బీర్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

- రెండేళ్లలో లక్షా 82వేల ఎకరాలకు సాగునీరందించాలి
- ప్యాకేజీ – 21 పనులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ సమీక్ష
- హాజరైన షబ్బీర్, భూపతిరెడ్డి, మహేశ్‌గౌడ్

డిచ్‌పల్లి/నిజామాబాద్ సిటీ: ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులో భాగంగా మంచిప్ప ప్రాజెక్టు నిర్మాణ పనులను పాత డిజైన్ ప్రకారం చేపట్టి రెండు సంవత్సరాల్లో లక్షా 82 వేల ఎకరాలకు సాగునీరందించాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టుల పనులపై ఆదివారం హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శాఖ ఉన్నతాధికారులతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. తాను ప్రతిపాదించిన విధంగా మంచిప్ప ప్రాజెక్టు పనులను పాత డిజైన్ ప్రకారం పూర్తి చేయడంతోపాటు రూరల్ నియోజకవర్గంలోని అన్ని నీటిపారుదల శాఖ ప్రతిపాదనలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు.

వ్యవసాయానికి పెద్దపీట
ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామని, సకాలంలో నీటి పంపిణీకి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మునిపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను మంజూరు చేస్తామని, ఆర్మూర్ నియోజకవర్గంలోని నాలుగు చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. చౌట్‌పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో పైపులైన్ లీకేజీలకు తక్షణమే మరమ్మతులు చేయాలని, సిద్ధాపూర్ రిజర్వాయర్‌ను త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించినట్లు షబ్బీర్ తెలిపారు.

అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది

- బీజేపీ ఒత్తిడితోనే భారతరత్న
- ఎంపీ ధర్మపురి అర్వింద్



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా వాడుకుని మానసికంగా హింసించిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధిచేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ చావుకు మొట్టమొదటి కారణం కాంగ్రెస్సేనని, ఆయనను రెండుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో ఓడించిందని ఆరోపించారు. బీజేపీ ఒత్తిడితోనే ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చారన్నారు. అంబేడ్కర్ పేరుతో కాంగ్రెస్ ఓట్లు అడగడం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్ పుట్టిన స్థలం, చదువుకున్న స్థలం, దీక్షతీసుకున్న స్థలం, మరణించిన స్థలాన్ని పంచతీర్థాలుగా మార్చి పర్యాటక ప్రాంతంగా ప్రధాని నరేంద్రమోదీ మార్చారని గుర్తుచేశారు.

పవన్‌ను విమర్శించడం తగదు
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఎమ్మెల్సీ కవిత విమర్శించడం తగదని అర్వింద్ అన్నారు. రాజకీయాల్లోకి రాకముందే ఆయనకు ఎంతో ఫేమ్ ఉందని, సినిమాల్లో వచ్చే సంపాదనను పక్కనపెట్టి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. కవిత ఎలా ఫేమ్ అయ్యారని ప్రశ్నించారు. సంచులు మోసే సంస్కృతి కవిత, రేవంత్‌రెడ్డిలదేనని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ

- పోలీసు శాఖ ఆధ్వర్యంలో వేసవి శిబిరం

ఖలీల్‌వాడి: ఆత్మరక్షణపై విద్యార్థినులకు ఉచితంగా వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పోతరాజు సాయిచైతన్య పేర్కొన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరానికి జిల్లాలోని 9, 10, ఇంటర్మీడియెట్ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు ఆర్‌బీవీఆర్‌ఆర్ స్కూల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శిబిరంలో సెల్ఫ్ డిఫెన్స్(ఆత్మ సంరక్షణ), మోటివేషన్, మహిళలపై జరిగే నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 24వ తేదీ వరకు 90009 94312 నంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఈగ సంజీవ్‌రెడ్డి

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులు

నిజామాబాద్ నాగారం: ఆర్చరీ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని సంజీవరెడ్డి నగర్ కాలనీలో ఆదివారం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ రావడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గంట ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఈగ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎంవీ సుబ్బారావు, కోశాధికారిగా మంథని బాలగంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కే గంగరాజు, సంయుక్త కార్యదర్శిగా ఈగ పోతన్న, సభ్యుడిగా బదావత్ గణేశ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ నాలుగేళ్లపాటు కొనసాగనున్నది. ఎన్నికల అబ్జర్వర్లుగా అరవింద్ కుమార్, అంద్యాల లింగన్న, మీసాల ప్రశాంత్‌కుమార్ వ్యవహరించారు. ఈగ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని, క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆర్చరీ క్రీడాకారుడినైన తాను జిల్లాకు చెందిన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతానని ప్రధాన కార్యదర్శి గంగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో బోర్గాం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, గాధరి సంజీవరెడ్డి, సయ్యద్ నబీ తదితరులు పాల్గొన్నారు.

చెత్త మంటలు

- నాగారం డంపింగ్ యార్డులో తరచూ అగ్ని ప్రమాదాలు
- వేసవిలో తీవ్రమవుతున్న సమస్య
- దట్టమైన పొగ, ఘాటు వాసనలతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి
- చెత్త వాహనాలను అడ్డుకుంటున్న ప్రజలు



నాగారం డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ (ఫైల్)

నిజామాబాద్ సిటీ: జనావాసాలకు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు వెదజల్లుతున్న దుర్గంధం భరించడం స్థానికులకు నిత్య కృత్యమైంది. తరచూ అగ్ని ప్రమాదాలతో వ్యాప్తి చెందుతున్న పొగ, ఘాటైన వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితి నుంచి విముక్తి ఎప్పుడోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

తరచూ ఘటనలు..
నిజామాబాద్ నగరంలో రోజుకు 280 నుంచి 300 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించి మున్సిపల్ వాహనాల ద్వారా దాదాపు 51 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నాగారం డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పాలిథిన్ కవర్లు, తడి, పొడి చెత్త, రబ్బరు, టైర్లు, ఇతర వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. చెత్త నుంచి ఎరువులు తయారుచేసే ప్రక్రియ ఉన్నా.. అది మందకొడిగా సాగుతోంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుండడంతో చెత్త, ఇతర పదార్థాలు కుళ్లిపోయి రసాయన ఉద్గారాలు విడుదలవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఎండ వేడిమితో చిన్నగా మొదలవుతున్న మంటలకు రసాయన ఉద్గారాలు తోడవడంతో పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్నాయి.

దట్టమైన పొగ..
డంపింగ్‌యార్డు నుంచి దట్టమైన పొగ వస్తుండడంతో స్థానికులు అస్వస్థతకు లోనవుతున్నారు. యార్డుకు సమీపంలోనే డీఎస్ కాలనీ, 300 క్వార్టర్స్, 50 క్వార్టర్లు, టైలర్స్ కాలనీ ఉన్నాయి. దాదాపు 400 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ మంటలు, ఘాటైన వాసన వస్తుండడంతో ప్రజలు ఆగ్రహంతో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు.

వేరే చోటికి తరలించాలి



డంపింగ్ యార్డును నాగారం నుంచి వేరేచోటికి తరలించాలి. జనావాసాలకు 5 నుంచి 6 కిలోమీటర్ల దూరంలో డంపింగ్‌యార్డు ఉండాలి. కానీ 80 క్వార్టర్స్‌ను ఆనుకొని ఉంది. వేసవి వచ్చిందంటే భయం భయంగా బతుకుతున్నాం. పొగతో కళ్లు మండుతున్నాయి.

– బిజిగాం సుజాతాగంగాధర్, స్థానికురాలు

రాత్రింబవళ్లు శ్రమించాం



ప్రతి వేసవి కాలంలో డంపింగ్‌యార్డులో మంటలు సహజమే. కానీ, కొన్నిసార్లు మంటలు అదుపులోకి రావడం లేదు. రాత్రింబవళ్లు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెస్తున్నాం. స్పెషల్ టీంను ఏర్పాటు చేశాం. 24 గంటలు డ్యూటీ చేస్తున్నాం. పది రోజులుగా ఉన్న సమస్య ప్రస్తుతం సద్దుమణిగింది.

– జక్కు ప్రభుదాస్, డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి

శాశ్వత పరిష్కారానికి చర్యలు



డంపింగ్‌యార్డులో చెలరేగే మంటలు ఆర్పేందుకు శాశ్వత చర్యలు తీసుకుంటున్నాం. నీటి వసతి కోసం రెండు బోర్లు వేయిస్తున్నాం. వాటర్ ట్యాంక్‌లు కట్టిస్తాం. స్ప్రింక్లర్ల ద్వారా నీటిని పంపి వేడిని చల్లారుస్తాం. స్థానికులు ఆందోళన చెందొద్దు. సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలి.

– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

భక్తిశ్రద్ధలతో బైసాఖీ

నిజామాబాద్ రూరల్: నగరంలో గురుద్వారా కమిటీ సభ్యులు ఆదివారం బైసాఖీ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాములబస్తీలోని ఫతేగర్ గురుద్వారా సాహెబ్‌లో కీర్తనలు, ప్రార్థనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీకి ప్రత్యేకంగా తయారు చేయించిన సిక్కుల పవిత్ర తల్వార్‌ను ప్రతినిధి దర్శన్ సింగ్ సోకి, కమిటీ సభ్యులు అందజేశారు.





పాములబస్తీలో ఫతేగర్ గురుద్వారా సాహెబ్‌లో కీర్తనలు, ప్రార్థనలు చేస్తున్న సిక్కులు (ఇన్‌సెట్‌లో) సీపీ సాయిచైతన్యకు తల్వార్‌ను అందజేస్తున్న సిక్కులు

క్లుప్తంగా

ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగం మనదే



వెబినార్‌లో పాల్గొన్న తెయూ వీసీ, రిజిస్ట్రార్, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): బీఆర్ అంబేడ్కర్ భారతదేశాన్ని కేవలం రాజకీయంగా కాకుండా ప్రజాస్వామ్యంగా మార్చాలనే లక్ష్యంతో ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగం రూపొందించారని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం తెయూ ఎస్సీ సెల్ డైరెక్టర్ వాణి నేతృత్వంలో '21వ శతాబ్దంలో అంబేడ్కర్ ఆలోచనల ఔచిత్యం' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వర్తమాన సమాజంలో భారతదేశానికి అంబేడ్కర్ ఆలోచనలు అనుసరణీయమన్నారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను వేరువేరుగా చూడలేమన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుకుమార్ మాట్లాడుతూ.. ఆధునిక భారతదేశంలో రాజ్యాంగం ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగరాజు, కేఆర్‌ఈఏ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాంబయ్య మాట్లాడారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, డీన్‌లు ఘంటా చంద్రశేఖర్, రాంబాబు గోపిశెట్టి, పీఆర్‌వో పున్నయ్య, అధ్యాపకులు నాగరాజు, జెట్లింగ్ ఎల్లోసా, ప్రసన్నరాణి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో కుస్తీపోటీలు



మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. పోటీల్లో చుట్టుపక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మల్లాయోధులు భారీగా తరలివచ్చారు. విజేతలకు నిర్వాహకులు వెండి కడియం, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వీడీసీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలప లారీ బోల్తా



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామ శివారులో ఆదివారం కలప లారీ బోల్తాపడింది. పిట్లం వైపు నుంచి నిజాంసాగర్ వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

మద్నూర్(జుక్కల్): మద్నూర్ ఎస్సై విజయ్ కొండ సహకారంతో మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారయణ గోశాలలో ఆదివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గోశాలలో ఆవులు చోరీకి గురికాకుండ ఉండేందుకు సీసీ కెమెరాలను ఎస్సై ఏర్పాటు చేయించారు. అనంతరం ఆవులను ఎలా రక్షించుకోవాలో గోశాల కమిటీకి ఎస్సై పలు సూచనలు సలహాలు అందించారు. అనంతరం ఎస్సైని గోశాల కమిటీ అధ్యక్షుడు సంజయ్ సన్మానించారు.

పొగాకు రైతుల్లో టెన్షన్

- బీట్‌ల ప్రారంభంలో కంపెనీల జాప్యం
- వాతావరణ పరిస్థితులతో ఆందోళన



పొగాకు కట్టలను బార్దాన్ కింద కప్పిపెట్టిన రైతులు

రెంజల్(బోధన్): పొగాకు బీట్లు ప్రారంభించకపోవడంతో రైతులు టెన్షన్ పడుతున్నారు. ఓ పక్క అకాల వర్షాల భయం వెంటాడుతుండగా, మరోపక్క అధిక వేడితో తేమ వచ్చి పొగాకు బూజు పడుతున్నట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలలోనే ప్రారంభించాల్సిన బీట్లు ఆలస్యం కావడంతో ఆర్థికంగా అదనపు భారం పడుతుందంటున్నారు. బీట్‌లు ఎప్పుడెప్పుడా అని కంపెనీ ప్రతినిధుల రాక కోసం రైతులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

సుమారు 12వేల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి జిల్లాలోని బోధన్, బాన్సువాడ డివిజన్‌లలోనే పొగాకును అత్యధికంగా రైతులు సాగు చేస్తారు. సుమారు ప్రతి సంవత్సరం 10నుంచి 12వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. గత 50 సంవత్సరాలుగా ఇక్కడి రైతులు వీఎస్‌టీ(వజీర్ సుల్తాన్‌ట్యూబాకో) కంపెనీతో ముందస్తు ఒప్పందం చేసుకుని పంట సాగు చేస్తారు. ఇటీవల వీఎస్‌టీతో పాటు పీటీపీ, ఐటీసీ, కేఆర్‌కే కంపెనీలు ముందుకు వచ్చి పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి. కంపెనీ ప్రతినిధులు ముందుగా రైతులతో బాండ్లు (ఒప్పంద పత్రం) రాయించుకుని పర్యవేక్షణ చేస్తారు. కానీ రెండు సంవత్సరాలుగా ఒప్పందం లేకుండానే వీఎస్‌టీపై ఆధారపడి నమ్మకంతో రైతులు పంటను సాగు చేస్తున్నారు. గత సంవత్సరం పొగాకుకు మార్కెట్లో డిమాండ్ ఉండటంతో కంపెనీలు మంచి ధర చెల్లించాయి. ఈయేడు అదే ధర చెల్లిస్తారని రైతులు ఆశించి అధికంగా సాగు చేశారు. ప్రతీ సంవత్సరం కంపెనీలు రూ.200 నుంచి 5 వందల వరకు ధరను పెంచుతూ వస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా కంపెనీలు త్వరగా బీట్లు ప్రారంభించాలని అన్నదాతలు కోరుతున్నారు.

మహారాష్ట్రలో తక్కువ ధరకు కొనుగోళ్లు

సరిహద్దున గల మహారాష్ట్రలో రైతుల నుంచి పొగాకు కొనుగోళ్లను ఆయా కంపనీలు ప్రారంభించగా, తెలంగాణలో ఎందుకు జాప్యం చేస్తున్నారో ఇక్కడి రైతులకు అంతుచిక్కడంలేదు. ధరలో వ్యత్యాసం ఉండటంతో ముందుగా అక్కడ కొనుగోళ్లు చేపడుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. మహారాష్ట్ర కమీషన్ ఏజెంట్ల ద్వార కొనుగోళ్లు చేపడుతూ ఇక్కడి రైతులను ఉద్దేశ్య పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. గత సంవత్సరం వీఎస్‌టీతో సహా పలు కంపెనీలు క్వింటా పొగాకుకు రూ.13,500 చెల్లించాయని రైతులు పేర్కొంటున్నారు. కానీ ఈ సీజన్‌లో కమీషన్ ఏజెంట్ల ద్వార మహారాష్ట్రలో క్వింటా పొగాకును రూ.9వేల నుంచి రూ.11వేల వరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



పొగాకును చూపిస్తున్న రైతులు

వెంటనే బీట్లు ప్రారంభించాలి



16 ఎకరాల్లో పొగాకు పండించాను. యేటా పంట పెట్టుబడులు పెరుగుతున్నాయి. వీఎస్‌టీ కంపెనీ ప్రకటించిన ధరనే మిగిలిన కంపెనీలు అనుసరిస్తాయి. ఎప్పుడైనా మార్చిలో కొనుగోలు చేసి, ఏప్రిల్‌లో బిల్లులు చెల్లించేవారు. ప్రస్తుతం బీట్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. కంపెనీలు స్పందించి బీట్లను ప్రారంభించాలి.

–దేవేందర్, రైతు, కందకుర్తి

నిర్లక్ష్యం చేస్తున్నారు



పొగాకు కంపెనీలు కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నాయి. కమీషన్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మహారాష్ట్రలో కొనుగోలు చేపట్టి అక్కడి రైతులను నిలువునా ముంచుతున్నారు. జిల్లా అధికారును కలిసి ఫిర్యాదు చేస్తాం, మహారాష్ట్ర నుంచి పొగాకు లారీలు తెలంగాణ మీదుగా ఆంధ్రకు తరలిస్తున్నారు. సరిహద్దుల్లో పొగాకు లారీలను అధికారులు నియంత్రించాలి. అప్పుడే కంపెనీలు ముందుకు వస్తాయి. –సిరాజ్‌బేగ్, రైతు, కందకుర్తి

పన్ను చెల్లింపుల్లో నాగాపూర్ ఆదర్శం



నాగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- రెండు దశాబ్దాలుగా వంద శాతం పన్నులు చెల్లిస్తున్న గ్రామస్తులు

బాల్కొండ: మండలంలోని నాగాపూర్ గ్రామం ఇంటి పన్ను చెల్లింపుల్లో ఆదర్శంగా నిలుస్తుంది. గ్రామస్తులంతా ఇరవై ఏళ్లుగా నూరుశాతం ఇంటి పన్నులు చెల్లిస్తూ ఐక్యతకు మారుపేరుగా నిలుస్తున్నారు. నాగాపూర్ గ్రామం ఎస్సారెస్పీలో పాక్షికంగా ముంపుకు గురైన గ్రామం. గ్రామస్తుల భూములు మొత్తం ప్రాజెక్ట్ నిర్మాణంలో కోల్పోయారు. అయినా ధైర్యం కోల్పోకుండా తమ గ్రామాన్ని పున:నిర్మాణం చేసుకుని పూర్వ వైభవం కోసం కృషి చేశారు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగింపునకు ముందే నూరు శాతం ఇంటి పన్నును చెల్లిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం కూడా పన్నులను చెల్లించారు. ఇంటి పన్ను చెల్లింపులోనే కాదు రాజకీయంగా కూడ చైతన్యవంతమైన గ్రామం. గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చిన కలిసి కట్టుగా ఉండి పరిష్కరించుకుంటారు. ఎవరికి సమస్య వచ్చిన గ్రామ సమస్యగా భావిస్తారు. జీపీ వద్దకు రావాలని ఒక్కసారి మైక్‌లో ప్రకటిస్తే చాలు ఇంటికి ఇద్దరు చొప్పున వచ్చి వాలుతారని గ్రామస్తులు అంటున్నారు. మురికి కాలువలు, సీసీ రోడ్లు, తాగునీటి వసతిని కల్పించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి తమ గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయుటకు నిధులను మంజూరు చేయాలని కోరుతున్నారు.

అందరూ ముందే చెల్లిస్తారు..



ఇంటి పన్ను చెల్లింపులో మా గ్రామస్తులు ఆదర్శంగా ఉంటారు. ఇంటి పన్ను ఏడాది అయ్యేలోపు అడగ కుండానే చెల్లిస్తారు. గత ఇరవై ఏళ్లు నూరు శాతం పన్నులు చెల్లించడం గ్రామానికే గర్వంగా ఉంది.

– వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్, నాగాపూర్

ఒక్కసారి చెబితే..



గ్రామస్తులు ఇరవై ఏళ్ల నుంచి నూరు శాతం ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. ఒక్కసారి చెబితే చాలు కార్యాలయానికి వచ్చి పన్ను చెల్లిస్తారు. ప్రజలు అధికారులతో ఎప్పుడూ సహకరిస్తునే ఉంటారు.

– అబ్దుల్ కలీం, కారోబార్, నాగాపూర్

ప్రమాదమా..? తగలబెట్టారా..?

- సందేహాలకు తావిస్తున్న ఈతవనం దగ్ధం ఘటన

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలంలోని తాళ్ల రాంపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ, గౌడ సంఘంల మధ్య ఏర్పడిన వివాదం ముదిరిన సమయంలో ఈత వనం దగ్ధం కావడం అనేక అనుమానాలకు తావిస్తుంది. ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఈత చెట్లు కాలిపోయాయా లేక ఎవరైనా దుండగులు కావాలనే నిప్పు అంటించారా అనే విషయం పోలీసులు, ఎక్సైజ్ అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. అక్టోబర్‌లో తాటి చెట్ల విషయంలో గౌడ సంఘం, గ్రామాభివృద్ధి సంఘాల మధ్య వివాదం ఏర్పడింది. తమ గ్రామంలో తాటి చెట్లు వృథాగా ఉన్నాయని, వాటిని గీసి కల్లు విక్రయించాలని వీడీసీ సూచించింది. గీత కార్మికులు ఒప్పుకోకపోవడంతో తాటి చెట్లను తమకు స్వాధీనం చేయాలని వీడీసీ ఆదేశించింది. దీనికి కూడా గీత కార్మికులు ఒప్పుకోకపోవడంతో గ్రామంలో ఈత కల్లు ఎవరూ తాగరాదని వీడీసీ కట్టడి చేసింది. పొరుగు గ్రామాల వారికి మాత్రమే కల్లు విక్రయించుకుంటున్నారు. గ్రామస్తులు ఎవరూ కల్లు కొనకపోవడంతో గిరాకీ లేక నష్టపోతున్నామని గౌడ సంఘం సభ్యులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల శ్రీరామనవమి రోజున ఆలయానికి వెళ్లిన గౌడ సంఘం మహిళలను వీడీసీ బయటకు గెంటివేయడంతో కేసు నమోదైన విషయం విదితమే. ఈ వివాదం సమసిపోక ముందే శనివారం ఈతవనం దగ్ధమవడంతో పక్కా ప్రణాళికతోనే ఘటన జరిగిందని గౌడ సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఈత చెట్లు లేకుండా చేయాలని చూశారు..

హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం చెట్లను గీయలేదు. అందువల్ల శనివారం గీత కార్మికులు, కాపలా మనిషి ఈత వనంలో లేనిది చూసి నిప్పు పెట్టారు. ఈత చెట్లు పూర్తిగా అంతరించి పోతే మాకు ఉపాధి ఉండకుండా పోతుందనే కుట్రతోనే చెట్లకు నిప్పు పెట్టారు.

– కోటగిరి రామాగౌడ్, గౌడ సంఘం నాయకుడు

ఉపాధ్యాయ ఉద్యమనేతకు కన్నీటి వీడ్కోలు

- కందుకూరి రమణ అంత్యక్రియలకు తరలివచ్చిన టీచర్లు, ప్రజాసంఘాల నేతలు



రమణకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయ ఉద్యమాలతో పాటు తెలంగాణ ఉద్యమంలో, అనేక సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని క్యాన్సర్‌తో చనిపోయిన టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి రమణ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం కామారెడ్డి పట్టణంలో జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల నేతలు తరలివచ్చారు. ఆయనకు ఘన నివాళులు అర్పించారు. హౌసింగ్ బోర్డులోని ఆయన నివాసం నుంచి పెద్ద చెరువు దిగువన ఉన్న శ్మశాన వాటిక వరకు జరిగిన అంతిమయాత్రలో వందలాది మంది పాల్గొన్నారు. పలువురు ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు.

51ఏళ్ల తర్వాత కలిసిన బాల్య మిత్రులు



మాణిక్ భవన్ స్కూల్ 1973-74 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



ఎల్లారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ 1994-95 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

డిచ్‌పల్లి: వారంతా పూర్వ విద్యార్థులు. 51ఏళ్ల క్రితం పదోతరగతి చదివి ఎక్కడెక్కడో స్థిరపడిన వారు. మళ్లీ ఇన్నాళ్లకు కలిశారు. గత మధురస్మృతులను నెమరువేసుకుని పరవశించి పోయారు. జిల్లా కేంద్రంలోని మాణిక్ భవన్ పాఠశాలలో 1973–74 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు డిచ్‌పల్లిలోని ఫాంహౌస్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆటపాటలతో అలరించారు. హైదరాబాద్, విశాఖపట్నంతో పాటు అమెరికాలో స్థిరపడిన ఒకరు సమ్మేళనానికి తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా ఆటపాటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. డిచ్‌పల్లి సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, నాగరాజు, అశోక్, చిరంజీవి, ఉమాపతి, చంద్రసేన్, సుబ్రహ్మణ్యం, రాజేశ్వర్, జనార్దన్ యాదవ్, వీరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో 22ఏళ్లకు..

కామారెడ్డి రూరల్: కామారెడ్డిలోని వివేకనంద పాఠశాలలో 2002–2003 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. 60 మంది విద్యార్థులకుగాను 45 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరై, ఆనాటి తీపి గుర్తులను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను సన్మానించారు. అనంతరం ఆటపాటలు, విందుభోజనంతో ఆహ్లాదంగా గడిపారు. నగేష్‌గుప్తా, మహేశ్వరీ, బబిత, జ్యోతి, దొడ్లె సంజీవ్‌కుమార్, సుధాకర్, భాస్కర్, రణధీర్ తదితరులు ఉన్నారు.





వివేకానంద పాఠశాల 2002-03 ఎస్సెస్సీ బ్యాచ్.. పెద్దవాల్గోట్ జెడ్పీహెచ్‌ఎస్ 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్

ఎల్లారెడ్డిలో ముప్పై ఏళ్లకు..

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1994–95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి 30 ఏళ్ల తరువాత విద్యార్థులంతా కలుసుకున్నారు. అనంతరం వారికి పాఠాలను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పద్మ శ్రీకాంత్, వెంకట్‌రాములు, వెంకటేశం, దత్తు, విజయ్, నర్సింలు తదితరులున్నారు.

పెద్దవాల్గోట్‌లో 21ఏళ్లకు..

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003–04 ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని సరదాగా గడిపారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

పద్మాజీవాడిలో 25ఏళ్లకు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడిలో ఆదివారం మాతృశ్రీ జూనియర్ కళాశాలకు చెందిన 1998–2000 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఒక్కచోట చేరారు. పద్మాజీవాడి శివారులో ఓ వ్యవసాయ క్షేత్రంలో కలుసుకుని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. గురువులు రాజ గంబీర్‌రావు, గోపాల్‌రెడ్డి, లింగారెడ్డి, కృష్ణ, కృష్ణ ప్రసాద్, పూర్వ విద్యార్థులు శ్రీధర్ రెడ్డి, కృష్ణరెడ్డి, సంతోష్, రాజేందర్, శ్రీకాంత్, మోహన్, గంగాధర్, సురేందర్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



1998-2000 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శీను (ఫైల్)

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నందిపేటకు చెందిన పురుషోత్తపట్నం శ్రీను (48) గురుకుల పాఠశాలలకు చికెన్ సప్లయ్ చేస్తుండేవాడు. కమ్మర్‌పల్లి గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం చికెన్ డెలివరీ చేసేందుకు అతడు కారులో బయలుదేరాడు. కమ్మర్‌పల్లి మండలం ఉప్పులూరు ఏకలవ్యనగర్ వద్ద అతడి కారుకు ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు నడుపుతున్న శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న అతడి కూతురు, ఆమె స్నేహితురాలికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీను మృతిచెందాడు.

కల్వర్టు గుంతలో పడి ఇద్దరికి గాయాలు





ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. అన్నాసాగర్ గ్రామానికి చెందిన బాలరాజు, తన కూతురు భావనతో కలిసి ఆదివారం బైక్‌పై ఎల్లారెడ్డికి బయలుదేరారు. తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు కల్వర్టు గుంతలో వారు పడిపోయారు. ఈ ఘటనలో తండ్రి, కూతురికి గాయాలు కావడంతో స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలరాజుకు తీవ్రగాయాలు కావడంతో కామారెడ్డికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి..



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని సంగం గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో నలుగురు గాయపడ్డారు. వెంటనే బాధితులను స్థానికులు 108లో బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్కను స్థానికులు కొట్టి చంపేశారు.

నందిపేటలో ధాన్యం బస్తాల చోరీ



లారీ నుంచి ఆటోలోకి డంప్ చేస్తున్న ధాన్యం బస్తాలు

నందిపేట్(ఆర్మూర్): వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నుంచి రైస్‌మిల్‌కు లారీ తరలిస్తుండగా మార్గ మధ్యలో డ్రైవర్ చోరీ చేసిన ఘటన నందిపేట మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నందిపేట మండలం చింరాజీపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఆదివారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలోని రాజరాజేశ్వర రైస్‌మిల్‌కు తరలించారు. మార్గ మధ్యలో నందిపేట వద్ద డ్రైవర్ లారీని నిలిపి, కొన్ని ధాన్యం బస్తాలను ఆటోలో ఎక్కించాడు. ఈ తతంగాన్ని స్థానికులు అనుమానంతో వీడియో తీసి, సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్ అయింది. వీడియోను చూసిన రైతులు సొసైటీకి వెళ్లి అధికారులను అడగడంతో తాము కూడ లారీ ఇంకా రైస్‌మిల్‌కు చేరలేదని ఆందోళన చెందుతున్నామన్నారు. అనంతరం అధికారులు రైతులతో కలిసి ఘటన స్థలానికి వెళ్లి లారీ డ్రైవర్‌ను నిలదీయగా, చోరీని ఒప్పుకున్నాడు. గత మూడు రోజుల నుంచి ఇలాగే లారీలో బస్తాలు తక్కువగా రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మల్లారం తండాలో ఒకరి ఆత్మహత్య



విక్రమ్ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మల్లారం తండాలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన కెతావత్ విక్రమ్(26) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈక్రమంలో శనివారం రాత్రి తన పొలంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బడిలో చోరీకి యత్నించిన దుండగులు



కామారెడ్డి రూరల్: పాఠశాలలో చొరబడిన ముగ్గురు దొంగలు చోరీకి యత్నించగా గ్రామస్తులు వారిని వెంబడించి, ఒకరిని పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా.. టేక్రియాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం పాఠశాల వెనకాల ఉన్న ప్రహరీ నుంచి గుర్తుతెలియని ముగ్గురు దుండగులు బడిలోకి ప్రవేశించారు. వరండాలోని ఓ సెల్ఫ్ పైన ఉన్న ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులను సంచిలో వేసుకొని ఎత్తుకెళ్తుండగా స్థానికులు గమనించి వెంబడించారు. ఇద్దరు దుండగులు ప్రహరీ దూకి పారిపోగా, ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌రూం తాళాన్ని కూడా పగలగొట్టడానికి దొంగలు యత్నించినట్లు తెలిపారు.